క్లుప్తంగా

కొనసాగుతున్న పునఃప్రతిష్ఠా మహోత్సవం



జగ్గయ్యపేట: పట్టణంలోని అద్దాలబజార్‌లో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి వెండిదేవాలయంలో జరుగుతున్న పునః ప్రతిష్ఠా మహోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం గణపతిపూజ, పుణ్యహవాచనం, గోపూజ, మూలమంత్ర అనుష్ఠానములు,పంచామృతాభిషేకాలు, జలాభిషేకం, వంటి కార్యక్రమాలను అర్చకులు జొన్నాభట్ల కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మహిళలు పవిత్రజలాలతో జలబిందెలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. బుధవారం ఉదయం 8.59 నిమిషాలకు పునః ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు.

వైభవంగా శ్రీరామ నవమి ఉత్సవాలు



నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం సీతారామచంద్ర స్వామి వారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వైఖానస సంప్రదాయం పద్ధతిలో వసంతోత్సవం, మూలమంత్ర హోమాది క్రతువులు, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో నరసింహమూర్తి, అర్చకుడు దివి శశికృష్ణమాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు గర్భిణులు, బాలింతలకు పోషక విలువలపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీడీపీవో లక్ష్మీభార్గవి మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలో అన్ని గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ వరకు పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నందిగామ టౌన్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ పెసరమల్లి రమాదేవి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలని కోరారు.

స్వచ్ఛ నందిగామకు సహకరించాలి

నందిగామ టౌన్: స్వచ్ఛ నందిగామకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఏడవ వార్డులో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా విధిగా చెత్త కుండీలను వినియోగించాలన్నారు. ఇళ్లలోని తడిపొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. పలువురు నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల లారీ బోల్తా

విస్సన్నపేట: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న లారీ మండలంలోని చంద్రుపట్ల వద్ద మంగళవారం బోల్తా కొట్టింది. తెలంగాణ నుంచి విస్సన్నపేట వైపు ఈ లారీ అతివేగంతో వెళుతూ అదుపు తప్పి పల్టీ కొట్టింది. రోడ్డు వెంబడి కోళ్ల వ్యర్థాలు చెల్లాచెదురుగా పడటంతో దుర్గంధంతో గ్రామస్తులు, వాహన చోదకులు ఇబ్బందికి గురయ్యారు. మరో లారీలోకి ఈ వ్యర్థాలను లోడింగ్ చేసి తరలించారు. ప్రతి రోజూ కోళ్ల వ్యర్థాలను ఈ రహదారిలో రవాణా చేసే లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో దుర్గంధం భరించలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు.

ఆపే దమ్ముందా..!

- ఇష్టా రాజ్యంగా ఇసుక దోపిడీ
- పగలు తవ్వకం.. రాత్రి రవాణా..
- విచ్చలవిడిగా ఇసుక డంపింగ్
- మామూళ్ల మత్తులో అధికారులు



కంచికచర్ల మండలం కీసర మున్నేరు నుంచి అక్రమంగా తరలించి నిల్వ చేసిన ఇసుక

కంచికచర్ల: ప్రకృతి సంపదను ఎడాపెడా అధికార పార్టీ నేతలు దోచేస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా టిప్పర్‌లు, పెద్ద పెద్ద లారీలతో ఇసుక అక్రమ రవాణా చేసి సరిహద్దులు దాటించి రూ.లక్షలు గడిస్తున్నారు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులే పోటీపడి ఇసుకను కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. అడ్డుచెప్పాల్సిన అధికారులే ఇసుక అక్రమ రవాణాకు పచ్చజెండా ఊపుతున్నారు. ఈ అక్రమ రవాణాపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకొనే వారే కరువయ్యారు.

మూడు నియోజకవర్గాల్లో..

నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో అధికారపార్టీ నాయకులు పోటీపడి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఉచితం మాటున కూటమి నేతలు ఇసుకను యంత్రాలతో తవ్వుకుని రహస్య ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రి సమయాల్లో రాష్ట్ర సరిహద్దు దాటించేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన కరువు..

ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ప్రజలు సంబంధిత శాఖల అధికారులకు చెప్పినా స్పందన లేదని ప్రజలు అంటున్నారు. అక్రమంగా ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసులకు తెలిసినా నెలనెలా మామూళ్లు తీసుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కంచికచర్ల మండల పరిధిలో ఎస్. అమరవరం, వేములపల్లి, కీసర మున్నేరును అధికార పార్టీ ప్రజా ప్రతినిధి అనుచరులు అడ్డాగా చేసుకుని అక్రమ వ్యాపారానికి తెరలేపారు. కీసర, పెనుగంచిప్రోలు, ఆలూరుపాడు తదితర గ్రామాల్లో మున్నేరు ఇసుక క్వాలిటీ ఉండటంతో టీడీపీనేతలు దొంగచాటుగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెవిటికల్లు, గనిఆత్కూరులో గతంలో నిల్వ ఉంచిన ఇసుకను రాత్రీపగలు తోడేస్తున్నారు. ఈ ఇసుక మొత్తం వీరులపాడు మండలం పెద్దాపురం, గూడెం మాధవరం మీదుగా ఇసుక లారీల్లో రాష్ట్ర సరిహద్దు దాటుతోంది. అలూరుపాడు నుంచి బోనకల్లు మీదుగా ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలివెళుతోంది.



ఎస్.అమరవరం, వేములపల్లి గ్రామాల మధ్య నిల్వ చేసిన ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

ప్రేక్షకపాత్రలో అధికారులు..

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల ఎదుటే ఇసుక ట్రాక్టర్లు పరుగులు పెడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీనిపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారపార్టీకి అధికారులు వంత పాడుతున్నారని ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.



కాసరబాద కృష్ణానదిలో అనుమతి లేకుండా లారీలకు ఇసుక ఎత్తుతున్న దృశ్యం

అకాల వర్షంతో నేలపాలైన పంటలు



గనిఆత్కూరు లంకభూముల్లో అకాల వర్షానికి నేలకొరిగిన అరటితోట



ఈదురుగాలులకు కీసర మామిడితోటలో నేల రాలిన మామిడి కాయలు

కంచికచర్ల: అకాల వర్షం రైతులను నట్టేట ముంచింది. చేతికి వచ్చే పంట నేలపాలైంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం ఒక్కసారిగా కురవటంతో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. సోమవారం 4.6 ఎం.ఎం వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు.

దెబ్బతిన్న పంటల వివరాలు..

కంచికచర్ల మండలంలో 1,300 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట సాగుచేశారని, అయితే 55 ఎకరాల్లో పంట దెబ్బతిందని మండల వ్యవసాయ శాఖ అధికారి కే విజయకుమార్ మంగళవారం తెలిపారు. మండలంలో 42 ఎకరాల్లో అరటితోటలు లంకభూముల్లో రైతులు సాగుచేశారని, 20 ఎకరాల అరటితోటలు దెబ్బతిన్నాయని ఉద్యానశాఖ అధికారి నీలిమ తెలిపారు. నేలకొరిగిన అరిటితోటలను చూసిన రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆరుగాలం కష్టపడి అరటితోటను సాగుచేస్తే అకాల వర్షం పంటను నాశనం చేసిందని ఆందోళన చెందారు. కీసర, గండేపల్లి, నందిగామ పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులకు 50 ఎకరాల మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. పెద్ద పెద్ద గాలులు రావటంతో కొన్ని మామిడిచెట్లు విరిగిపోయాయి. దీంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటల పరిశీలన..

గనిఆత్కూరులో అకాల వర్షానికి దెబ్బతిన్న అరటితోటను ఉద్యాన అధికారిణి నీలిమ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సాహితి రైతులతో కలిసి పరిశీలించారు. అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు ఇస్తామని తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని నీలిమ తెలిపారు.

మామిడి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

మైలవరం: సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, అకాల వర్షానికి మామిడి రైతులు, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మైలవరం రైతు విభాగం, పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మైలవరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకులు మాట్లాడుతూ తీవ్రమైన గాలి, వర్షం కారణంగా మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, చాట్రాయి, గంపలగూడెం, నూజివీడు, తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో మామిడి, వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీనితో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకోవాలని కోరారు. పంట నష్టాన్ని పార్టీ నాయకులు పరిశీలించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, మండల పార్టీ నాయకులు కత్తుల వెంకటరెడ్డి, చాట్ల రాబర్ట్, కుప్పిరెడ్డి వర ప్రసాదరెడ్డి, గుడిసె ప్రభాకరరెడ్డి, కలకొండ రామారావు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిగూడెం మండలంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న నాయకులు

నేటి నుంచి సత్యమ్మ వారి జాతర

నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో సత్యమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో హరిగోపీనాథ్, ఉత్సవ కమిటీ సభ్యుడు మంచాల మాధవరావు పేర్కొన్నారు. స్థానిక ఆలయ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, స్నపన, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అఖండ దీప స్థాపన, కలశ స్థాపన పూజలతో మహోత్సవాలు ప్రారంభించటం జరుగుతుందన్నారు. ఈ నెల 10న బోనాలు, ప్రభల ఊరేగింపు, 11న అమ్మ వారికి విశేష అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, 12న రథోత్సవం,13న మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. చండీ సహిత రుద్ర గణపతి హోమాది క్రతువులు, అమ్మవారికి కుంకుమార్చనలు, ఖడ్గమాల, తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కొటికలపూడిలో ముగిసిన గ్రామోత్సవం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారామ కల్యాణం సందర్భంగా కొటికలపూడి గ్రామంలో మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గ్రామోత్సవం మంగళవారంతో ముగిసింది. శ్రీరామ నవమి పండుగరోజు స్వామివార్ల కల్యాణం అనంతరం స్వామివారి దీప స్తంభం, నరసింహస్వామి, చెన్నకేశవ స్వామి దైవాలతో పాటు వారి కోపాలను హరించే శాంతి స్వామి దైవాలను భక్తులు మోస్తూ వీధుల్లో ఊరేగించారు. ఇంటింటికీ దైవాలు, దీప స్తంభం చేరడంతో భక్తులు నీళ్ల వారబోసి కొబ్బరి కాయలు కొట్టారు. నూతన వస్త్రాలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.



దీప స్తంభం, దైవాలతో గ్రామోత్సవంలో భక్తులు

మండలంలో 200 పైగా ఉన్న బెల్ట్ షాపులను అరికట్టాలి

మైలవరం: మైలవరం మండలంలో 200లకు పైగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, వీటిని అరికట్టాలని, లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని సీపీఎం మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో తాగడానికి మంచినీళ్లు దొరకడం కష్టమేమోకానీ మద్యం మాత్రం బెల్ట్ షాపుల ద్వారా ఏరులై పారుతోందన్నారు. అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లో గ్రామ గ్రామానికి ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క గణపవరం గ్రామంలోనే పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని చెప్పారు. గణపవరం గ్రామంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడని, బెల్టు షాపులు మాత్రం వీధి వీధికి ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించాలని కోరారు.

14 మంది పాత నేరస్తుల బైండోవర్

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు మండలం పోలసానపల్లికి చెందిన 14 మంది పాత నేరస్తులను ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య మంగళవారం తహసీల్దార్ బీవీ సుబ్బారావు ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ అయిన వారిలో నారగాని వెంకటేశ్వరరావు, అచ్చి రాంబాబు, నారగాని ఏడుకొండలు, నారగాని శివరామకృష్ణ, నారగాని వరప్రసాద్, నారగాని మురళి, నారగాని సురేష్, నారగాని రమేష్, పలగాని సత్యనారాయణ, నారగాని శివశంకర్‌రావు, నారగాని రంగారావు, పామర్తి సాంబశివరావు, ముక్కు రవికిరణ్, నీలపు శివకుమారి ఉన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీరందరిని ఏడాది పాటు బైండోవర్ చేశామని, ఈ కాలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయల జరిమానా విధించడంతో పాటు ప్రభుత్వ పథకాలు వర్తించకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



వత్సవాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న బ్యాంకు మేనేజర్లు



నందిగామ ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

వత్సవాయి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు తరలివచ్చారు. బీసీ, ఈబీసీ, కమ్మ, కాపు, వైశ్య కార్పొరేషన్ల నుంచి రుణాలు పొందేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్, యూనియన్, సప్తగిరి గ్రామీణ బ్యాంకులకు చెందిన మేనేజర్లు దరఖాస్తులదారుల రికార్డులను పరిశీలించారు. మండలాన్ని రెండు భాగాలుగా చేసి ఉదయం పది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొన్ని గ్రామాల వారికి 2 నుంచి 5 గంటలకు వరకు మిగిలిన గ్రామాల వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి మొత్తం 60 యూనిట్లు మంజూరుకాగా 550 వరకు దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. రాంబాబు, ఈవోపీఆర్డీ మాధవి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

346 మందికి ఇంటర్వ్యూలు

నందిగామ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి పథకంలో భాగంగా ఆయా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో దరఖాస్తు చేసుకున్న 346 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 గ్రామాలకు సంబంధించి 47 యూనిట్‌లు మంజూరయ్యాయని చెప్పారు. కాగా కార్పొరేషన్ రుణాల విషయంలో అధికార పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి ఐదుగురికైనా రుణాలు మంజూరు చేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం పునరాలోచన చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు జవ్వాజి భాస్కరరావు, పలువురు నాయకులు కోరుతున్నారు. మండల పరిషత్ సిబ్బంది, ఆయా బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నేడు కూడా..

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు మండలంలో 14 గ్రామాలకు చెందిన 791 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా 558 మంది హాజరయ్యారని తెలిపారు. బుధవారం కూడా ఇంటర్వ్యూలు జరుగుతాయని అన్నారు. కంచికచర్లకు చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సప్తగిరి గ్రామీణబ్యాంకు, ఇండియన్ బ్యాంక్ అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.సుబ్రహ్మణ్యం, ఇందుపల్లి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్ల కార్యాలయంలో ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ, బ్యాంకు అధికారులు

నేడు జుజ్జూరులో ఇంటర్వ్యూలు..

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్ దరఖాస్తుదారులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుంధతీ దేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, కులధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్ కార్డు, తెల్లరేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. మండలంలో మొత్తం 988 మంది దరఖాస్తు చేసుకున్నారని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. మధ్యాహ్నం రెండు గంటల తరువాత ఇంటర్వ్యూలకు రావాలని సూచించారు.

రీసర్వే సక్రమంగా నిర్వహించాలి

తహసీల్దార్ కె.రాజ్‌కుమార్

ముసునూరు: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొర్లగుంట శివారు తాళ్లవల్లిలో రీసర్వే పనులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూముల సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను చూపే విధంగా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో మొత్తం సరిహద్దు నిర్దేశకాలు 83 కాగా, 10 పూర్తి చేశామన్నారు. కార్యక్రమాల్లో డీటీ పురుషోత్తమ శర్మ, వీఆర్‌ఓ మణీంద్ర, మండల సర్వేయర్ సురేష్, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లవల్లిలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

విస్సన్నపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. నాగరాజు, కోట కల్యాణ్ ప్రభుత్వాన్ని కోరారు. విస్సన్నపేట మండలం కొండపర్వలో ఉపాధి కూలీల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి కూలీలకు రూ.72 కోట్ల మేర వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని, గత 11 వారాలుగా ఉపాధి వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రతి వారం పే స్లిప్పులు ఇవ్వాలని, పని ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించాలని కోరారు. సీఐటీయూ నాయకులు పానెం ఆనందరావు, ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొండపర్వలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

14న మద్యం షాపులను మూసివేయాలి

చాట్రాయి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న మద్యం అమ్మకాలను నిలిపి వేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాంధీ జయంతి, ఆగస్టు 15న మద్యం షాపులను మూసి వేస్తున్నారని, అదే విధంగా అంబేడ్కర్ జయంతి రోజున కూడా మద్యం షాపులను మూసివేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేశారు.

గాలులతో విద్యుత్ శాఖకు రూ.2 లక్షల నష్టం

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంగా ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. అర్ధరాత్రి వేళ విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మతులు నిర్వహించి మంగళవారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వివిధ గ్రామాల్లో ఆరు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, విద్యుత్ తీగలు తెగిపోయాయని ఏఈ వెంకన్న తెలిపారు. విరిగిన స్తంభాల స్థానంలో యుద్ధప్రాతిపదికన నూతన పోల్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ శాఖకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని ఏఈ చెప్పారు

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తిరువూరు: క్రికెట్ బెట్టింగ్ వివాదంలో యువకుడిపై దాడి చేసిన నిందితుడిని తిరువూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరు పట్టణంలోని మునుకుళ్ల రోడ్డులో మద్యం మత్తులో కర్రి నరేష్ అనే యువకుడిపై సీసాతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన గంగా మహేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.